క్లుప్తంగా

పోలీస్ కార్యాలయాల పరిశీలన



కార్యాలయాలను పరిశీలిస్తున్న ఎస్పీ

బొమ్మలసత్రం: జిల్లా కేంద్రంలోని వివిధ పోలీస్ కార్యాలయాలను ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా బుధవారం పరిశీలించారు. ఏఆర్, డీసీ ఆర్‌బీ, బిల్లాఫామ్, ఎస్‌బీ, పాస్‌పోర్ట్ విభాగం, మీటింగ్ హాల్, మోటర్ వెహికల్ విభాగం, కమ్యూనికేషన్, ఐటీ కోర్, సైబర్ క్రైమ్ కార్యాలయాలను ఆయన పరిశీలించారు. అక్కడి పనితీరు, సిబ్బంది సంఖ్య, విధులు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. కార్యాలయాల పనితీరు మెరుగుపరిచేందుకు అవసరమైన సలహాలు, సూచనలు అందించారు. ఎస్పీతో పాటు ఎస్‌బీ డీఎస్పీ సంతోష్, సీసీ నాగరాజు, సీఐలు, రవీంద్ర, వెంకటేశ్వరరావు, ఆర్ఐలు మంజునాథ, నాగభూషణ, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

ఎస్పీని కలిసిన జేసీ

బొమ్మలసత్రం: జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణాను నూతన జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. బదిలీపై జిల్లాకు వచ్చిన జేసీ..ఎస్పీని ఆయన కార్యాలయంలో కలిసి జిల్లాలో శాంతిభద్రతలపై ఆరా తీశారు. అలాగే హోమ్‌గార్డ్ కమాండెంట్ మహేష్ కుమార్ ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు.

మహానందీశ్వరుడికి పూజలు

మహానంది : మహానందీశుడిని నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ బుధవారం దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన జేసీకి ఏఈఓ ఓంకారం వెంకటేశ్వరుడు స్వాగతం పలికారు. ఈ మేరకు ఆయన శ్రీ కామేశ్వరీ దేవి, మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని ఇటీవల మహానందిలో సంచరిస్తున్న చిరుత వివరాలను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ రామచంద్రుడు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

మేలైన సాగు పద్ధతులతో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న ఏడీఏ రాజశేఖర్

నంద్యాల అర్బన్: మేలైన సాగు పద్ధతుల ద్వార రైతులు పంటలసాగు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏడీఏ రాజశేఖర్ అన్నారు. నంద్యాల మండలంలోని చాబోలు గ్రామంలో బుధవారం పొలంబడి కార్యక్రమంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో నాణ్యమైన అవశేషాలు లేని దిగుబడులు సాధించవచ్చన్నారు. మేలైన సాగు పద్ధతి పంటలకు బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలు లభిస్తాయన్నారు. ఈ పద్ధతుల్లో పంటల సాగుకు గ్రామ వ్యవసాయ సహాయకుడి వద్ద పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ ప్రసాద రావు, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు



ప్రథమనంది ఆలయంలో కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని ప్రథమనంది ఆలయంలో మంగళవారం హుండీ కానుకల లెక్కింపు జరిగింది. పది నెలలకు సంబంధించిన కానుకలు లెక్కించగా రూ.2,80,602 ఉన్నట్లు ఈఓ రామానుజన్, ఇన్‌స్పెక్టర్ శశికుమార్ తెలిపారు. గత ఏడాది కంటే ఈ ఏడాది ఆలయానికి రూ.50 వేలు ఎక్కువ ఆదాయం లభించింది అన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు ప్రవీణ్ రమణ, భక్తులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో ప్రోత్సహించాలి



నంద్యాల(న్యూటౌన్): విద్యార్థులను చదువుతోపాటు క్రీడల్లో ప్రోత్సహించాలని సమతా విద్యానికేతన్ కరస్పాండెంట్ బాలచంద్రుడు అన్నారు. బుధవారం శిక్ష సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖోఖో, కబడ్డీ, బాస్కెట్‌బాల్, క్రికెట్ తదితర ఆటల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి శిక్ష సప్తాహ్ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందన్నారు.

రైతుకు దక్కని భరోసా!

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఖరీఫ్ సీజన్‌కు ముందే పంట పెట్టుబడి సాయం
- కూటమి ప్రభుత్వంలో కనిపించని ఆ భరోసా
- ఎన్నికల ముందు ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని హామీ
- ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా స్పందించని సర్కారు
- పెట్టుబడికి అవస్థలు పడుతున్న రైతన్నలు

రైతన్నల సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలన సాగించింది. క్రమం తప్పకుండా ఏటా ఖరీఫ్ సీజన్‌లో పంట పెట్టుబడికి సాయం అందిస్తూ అండగా నిలిచింది. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి సర్కారు అన్నదాతల గోడు పట్టించుకోవడం లేదు. అన్నదాత సుఖీభవ పేరుతో ఎన్నికల ముందు ఏటా రూ. 20 వేలు సాయం అందిస్తామని ప్రకటించిన హామీని సైతం అమలు చేయకపోవడంతో సాగు ఖర్చులకు రైతుల అవస్థలు పడుతున్నారు.



గోస్పాడు సమీపంలో పంట సాగుకు పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతు

గోస్పాడు: ప్రస్తుతం నైరుతి రుతుపవనాల ప్రభావంతో జిల్లాలో మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. దీంతో జిల్లాలో ఖరీఫ్ పంటల సాగు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్‌లో మెట్ట పంటలు కంది, పెసర, మినుము వంటి తదితర పంటలతో పాటు మాగాణి సాగును రైతులు పెద్ద ఎత్తున చేపడుతారు. జిల్లా వ్యాప్తంగా 2,36,906 హెక్టార్లకు దాదాపు 79,013 వేల హెక్టార్లలో పంటలు సాగు చేపడుతున్నారు. సాగుదారుల్లో ఎక్కువగా చిన్న, సన్నకారు రైతులే ఉన్నారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పెట్టుబడి సాయంపై ఇప్పటి వరకు దృష్టి పెట్టలేదు. మరో పక్క బ్యాంకులకు 2004–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వ్యవసాయ రుణ ప్రణాళిక అందడం అలస్యం కావడంతో రైతులకు రుణాలు రీషెడ్యూల్ చేయలేదు. ఫలితంగా బ్యాంకుల్లో కూడా రైతులకు కొత్త రుణాలు మంజూరు కావడం అలస్యమవుతుంది. ఖరీఫ్ సీజన్ ముమ్మరంగా సాగుతున్న తరుణంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందకపోవడంతో రైతులు పంట పెట్టుబడి కోసం దిక్కులు చూస్తున్నారు.

గతంలో సీజన్‌కు ముందే పెట్టుబడి సాయం

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వ్యవ సాయ సీజన్ ప్రారంభానికి ముందే రైతులకు అకౌంట్లలో రైతుభరోసా కింద పెట్టుబడి సాయం జమయ్యేది. జూన్‌లో ప్రారంభమయ్యే ఖరీఫ్‌కు మే నెలలోనే రూ .7,500 చొప్పున ప్రతి రైతుకు అందేది. రబీ సీజన్ ప్రారంభంలో అంటే అక్టోబర్లో రూ. 4వేలు, జనవరి నెలలో మరో రూ.2 వేల సాయాన్ని ప్రభుత్వం క్రమం తప్పకుండా అందించేది. గత ఐదేళ్లగా సీజన్ల వారీగా ప్రతి రైతుకు ఏడాదికి రూ. 13,500 సాయం అందేది. భూమిలేని కౌలు రైతులకు, దేవదాయ, వక్ఫ్ వంటి ఇతర భూములను సాగు చేసుకుంటున్న వారికి కూడా ప్రభుత్వం సా యం అందించింది. ఇలా ఐదేళ్ల పాటు జిల్లా వ్యా ప్తంగా 2.34 లక్షల మంది రైతులకు రైతు భరోసా పథకం కింద రూ.1,475 కోట్లు అందించింది.

హామీ ఊసెత్తని కూటమి సర్కారు

ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఒకలా, అధికారంలోకి వచ్చిన తర్వాత మరోలా వ్యవహరిస్తోంది. ఎన్నికలకు ముందు ప్రతి రైతుకు ఏడాదికి రూ.20 వేల సాయం అందిస్తామని స్పష్టంగా ప్రకటించింది. నేడు సీఎం చంద్రబాబునాయుడు దీనిపై నోరు మెదపడం లేదు. వ్యవసాయ సీజన్ ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా రైతులకు ఇస్తామన్న రూ. 20 వేల సాయంపై స్పష్టమైన ప్రకటన చేయడం లేదు. దీంతో ఈ పథకం ఎప్పటి నుంచి అమలు అవుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో రైతు భరోసా వివరాలు ఇలా..

సంవత్సరం	రైతులు	చెల్లించిన మొత్తం రూ.కోట్లలో
2019-20	2,09,861	283.03
2020-21	2,15,936	291.5
2021-22	2,15,595	291.1
2022-23	2,21,241	298.7
2023-24	2,23,151	311.5

అన్నదాతలకు తప్పని తిప్పలు..

పొలాలు ఉన్న చిన్న, సన్నకారు రైతులు సీజన్ ప్రారంభం కావడంతో పైర్ల సాగుకు పెట్టుబడి రూపంలో ఆర్థిక పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుంది. కొద్దో గొప్పో పొలం ఉన్న చిన్న, సన్నకారు రైతులకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించే రైతు భరోసా నిధులు పంట పెట్టుబడికి ఎంతో ఉపయోగకరంగా ఉండేవి. అయితే ప్రస్తుత ప్రభుత్వంలో సీజన్ ప్రారంభమైనా సాయం అందకపోవడంతో వారంతా అవస్థలు పడాల్సి వస్తుంది. కొందరు తప్పని పరిస్థితిలో ప్రైవేట్ వ్యక్తుల వద్ద అప్పులు చేసి పైర్ల సాగు చేసుకుంటున్నారు.

హామీ అమలు చేయాలి



అధికారంలోకి వస్తే పంట సాగుకు రూ. 20 వేలు ఇస్తామని చెప్పారు. వ్యవసాయ పనులు మొదలై నెలన్నర అవుతుంది. సర్కారు ఇవ్వకపోవడంతో రైతులు పెట్టుబడుల కోసం బ్యాంకులను, ప్రైవేట్ వ్యక్తుల వద్దకు పోవాల్సి వస్తుంది. కొత్తప్రభుత్వం చెప్పిన ప్రకారం రైతులకు రూ.20వేలు ఇవ్వాలి. సీజన్‌లో వారికి ఇబ్బంది లేకుండా చూడాలి.

–చెన్నయ్య, సీపీఎం నాయకుడు

పెట్టుబడులకు ఇబ్బందులు



పంటల సాగు ప్రారంభం కావడం వల్ల పెట్టుబడుల కోసం ఇబ్బందులు పడుతున్నాం. గత ప్రభుత్వ హయాంలో పంటల సాగు మొదలవగానే మాకు అకౌంట్లో డబ్బులు పడేవి. దాని వల్ల ఎరువులు, విత్తనాలు వంటివి కొనుగోలు చేసేందుకు ఇబ్బంది ఉండేది కాదు. అయితే ఈ ఏడాది ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందలేదు. –మద్దిలేటి, రైతు

● వానొస్తే ఇంతే!



గుంతల మయంగా శిరివెళ్ల- యాళ్లూరు రోడ్డు

శిరివెళ్ల: శిరివెళ్ల మెట్ట వద్ద నుంచి యాళ్లూరు వరకు ఉన్న 8 కిలో మీటర్ల రోడ్డు అధ్వానంగా ఉంది. ఈ రహదారి వెంట వీరారెడ్డిపల్లె, కోటపాడు గ్రామాల ప్రజలు వాహనాల్లో రాకపోకలు సాగిస్తుంటారు. అయితే, రోడ్డు గుంతలమయంగా ఉండటంతో పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు. గత ప్రభుత్వం రోడ్డు విస్తర్ణ పనులకు 2022లో రూ. 23 కోట్ల నిధులు విడుదల చేసింది. రోడ్డు పనుల ప్రారంభించడంలో కాంట్రాక్టర్ జాప్యం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం రహదారి మరమ్మతులకు చొరవ తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

96 మద్యం బాటిళ్లు స్వాధీనం

ఉయ్యాలవాడ : మండలంలోని కాకరవాడ గ్రామానికి చెందిన కాలేసాహెబ్ గారి మాబుబాషా అనే వ్యక్తి నుంచి 96 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ రఫీ తెలిపారు. పై వ్యక్తి గ్రామంలో మద్యం విక్రయించేందుకు మద్యం బాటిళ్లను తీసుకెళ్తుండగా ఇంజేడు గ్రామ సమీపంలో దాడి చేసి పట్టుకున్నట్లు వెల్లడించారు. మాబుబాషాపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ బుధవారం తెలిపారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి



కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే ఆయాలు, స్కావెంజర్లకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం వారు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి కలెక్టర్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి శ్రీనివాసులు, శివ బాలకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు శుభ్రపరచడానికి ప్రభుత్వం ఆయాలను నియమించిందన్నారు. స్వచ్ఛభారత్‌లో భాగంగా కార్మికులుగా గుర్తించి కనీస వేతనం రూ.11500 ఇవ్వాలన్నారు. అలాగే ప్రభుత్వ గుర్తింపు కార్డులు ఇచ్చి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో ఓబులమ్మ, గుర్రప్ప, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో ప్రారంభమైన శిక్ష సప్తాహ్



జిల్లెల్లలో కబడ్డీ ఆడుతున్న బాలికలు



తెల్లపురి పాఠశాలలో ..

గోస్పాడు: ప్రభుత్వ పాఠశాలలో శిక్ష సప్తాహ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ అబ్దుల్‌కరీం తెలిపారు. మండల పరిధిలోని పాఠశాలల్లో బుధవారం మూడవరోజు ఆటలపోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఎన్ఈపీ విధానాన్ని అమలు చేసి నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశమంతా పాఠశాలల్లో శిక్ష సప్తాహ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా మండల పరిధిలోని పాఠశాలల్లో ఈనెల 22 నుంచి వారం రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేలా రాష్ట్ర సమగ్ర సర్వశిక్ష ఆదేశాలు జారీ చేసిందన్నారు. బుధవారం విద్యార్థులకు శారీరక సౌష్టవం ప్రాధాన్యత తెలిసేలా వివిధ రకాల క్రీడాంశాలపై పోటీలు నిర్వహించారు. అనంతరం క్రీడల ప్రాముఖ్యతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తహసీల్దారు రమణమ్మకు సత్కారం



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న డీటీ, సిబ్బంది

చాగలమర్రి: ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి బదిలీ సర్వ సాధారణమని డిప్యూటీ తహసీల్దారు విజయ్ కుమార్ పేర్కొన్నారు. బద్వేలు ఆర్‌డీఓ కార్యాలయంలో ఏఓగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై చాగలమర్రి తహసీల్దారుగా వచ్చిన రమణమ్మను ప్రభుత్వం మళ్లీ కడప జిల్లాకు బదిలీ చేసింది. ఈ నేపథ్యంలో ఆమెను డీటీ విజయ్ కుమార్‌తో పాటు సిబ్బంది శాలువ, పూలమాలలు వేసి సన్మానించారు. స్థానికంగా తహసీల్దార్ అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వీఆర్‌ఓలు శారద, శ్రీనివాసులు, బీసీ సంఘం నాయకులు సల్లా నాగరాజు, పక్కృద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పంటల్లో తెగుళ్లను గుర్తించండి



అల్లూరులో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏఓ

ఉయ్యాలవాడ : రైతులు ఖరీఫ్‌లో సాగు చేసిన మొక్కజొన్న, మినుము, వేరుశనగ, కంది తదితర పంటల్లో తెగుళ్లను నిర్ధారణ చేసి నివారణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి రాజేంద్రకుమార్ రైతులకు సూచించారు. బుధవారం పొలంబడి కార్యక్రమంలో భాగంగా అల్లూరు, మాయలూరు గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంటలను క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ మొక్కజొన్నలో కాండం తొలిచే పురుగు, మినుము పంటలో పల్లాకు వైరస్ తెగుళ్ల సోకినట్లు గుర్తించామన్నారు. మందులు పిచికారీ చేసి ఆయా పంటలను కాపాడుకోవాలని సూచించారు.

పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

ఉయ్యాలవాడ : ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని ఎంపీడీఓ రఘురాం తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల పరిధిలో 58 మంది రైతులు 82 ఎకరాల్లో పండ్ల తోటలు సాగు చేసుకునేందుకు దరఖాస్తు చేసుకోగా వారిని ఎంపిక చేయడం జరిగిందన్నారు. సపోట, నిమ్మ, డ్రాగన్ ఫ్రూట్స్, మామిడి, జామ, సీతాఫలం, 16 రకాల పండ్ల తోటలు సాగు చేసే పనులు క్షేత్రస్థాయిలో జరుగుతున్నాయన్నారు. సాగుకు సంబంధించి 3 సంవత్సరాల పాటు ప్రభుత్వం వంద శాతం సబ్సిడీతో తోటల రకాలను బట్టి ఎకరాకు రూ. 50 వేల నుంచి రూ. 2 లక్షల వరకు ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. ఏపీఓ రవిప్రకాష్ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం కావడంతో ఉపాధిలో పనికి వచ్చే కూలీల సంఖ్య తగ్గిందన్నారు. మండలంలో 5,324 జాబ్ కార్డులు కలిగిన కుటుంబాలు ఉండగా పనులకు సంబంధించిన వర్క్‌ఫైల్స్‌లో 14 అంశాలు, 7రకాల రికార్డుల నమోదు పకడ్బందీగా నిర్వహించాలని ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లకు సూచించారు. ఇప్పటి వరకు పని చేసిన ప్రదేశాల్లో నేమ్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు.

అంకెల బడ్జెట్

నంద్యాల(న్యూటౌన్): కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ అంకెల గారడీగా ఉందని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జేసీఎస్ పట్టణ అధ్యక్షుడు సాయిరాంరెడ్డి ఓ ప్రకటనలో ఆరోపించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఏపీకి ప్రత్యేక హోదా, కడప ఉక్కు ఫ్యాక్టరీ, రైల్వేజోన్ వంటి స్పష్టమైన హామీలు ఇవ్వకుండా అమరావతి అభివృద్ధికి రూ.15వేల కోట్లు కేటాయించిందన్నారు. విద్య, వైద్యం, యువతకు ఉపాధి కల్పనపై సరైన కేటాయింపులు లేవన్నారు. మధ్యతరగతి ప్రజలపై పన్ను భారం మోపడం సరికాదన్నారు., విద్యకు సంబంధించి డిజిటల్ గ్రంథాలయాలకు నిధులు ఇవ్వాలన్నారు. వెనుక బడిన జిల్లాలకు ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. విభజన హామీల సాధన కోసం కూటమి ప్రభుత్వం పోరాడాలన్నారు.

బడ్జెట్ కేటాయింపుల్లో సీమ ప్రాజెక్టులకు అన్యాయం

నంద్యాల(అర్బన్): రాయలసీమ పెండింగ్ ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుల్లో అన్యాయం చేసిందని కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనరసింహాయాదవ్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బడ్జెట్ కొత్తసీసాలో పాత సారా చందంగా ఉందన్నారు. కడప స్టీల్‌ప్లాంట్, విజయవాడలో మెట్రోరైలు, విశాఖ రైల్వేజోన్ తదితర వాటి ప్రస్తావన లేకుండా బడ్జెట్ ఉందన్నారు.

అలరించిన సంప్రదాయ నృత్యప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆలయ దక్షిణ మాఢవీధిలోని నిత్యకళావేదికపై కర్నూలుకు చెందిన సూర్యకళా కల్చరల్ అకాడమీ వారి సంప్రదాయ నృత్యం భక్తులను అలరించింది. కార్యక్రమంలో గణేశ ప్రార్థన, మహిషాసురమర్దిని, శివతాండవం, శంబో శివశంభో తదితర గీతాలకు డి.వి.మోక్షిత, గణత్రయ, ప్రణతి, బ్రహ్మశ్రీ నృత్యం చేశారు.

మహనీయులకు నివాళి



గుర్రం జాషువా, వెంకటరమణయ్య చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని పింగళి సూరన స్మారక శాఖ గ్రంథాలయంలో పద్మశ్రీ గ్రహీత, గ్రంథాలయ సర్వస్వం పత్రికా స్థాపకుడు అయ్యంకి వెంకటరమణయ్య జయంతి, నవయుగ కవిచక్రవర్తిగా పేరొందిన గుర్రం జాషువా 53వ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ మహనీయుల చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ గ్రంథాలయాల అభివృద్ధికి అయ్యంకి వెంకటరమణయ్య ఎంతో కృషి చేశారని చెప్పారు. అలాగే నవయుగ కవిచక్రవర్తి గుర్రం జాషువా అంటరానితనం నిర్మూలనకు ఎంతగానో పోరాడారని, అదేవిధంగా తన రేడియో ప్రసంగాలు, పాటలతో ప్రజలను చైతన్యవంతులు చేశారన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది ఆర్ఈ శ్రీధర్, గ్రంథాలయ పాఠకులు రిటైర్డ్ టీచర్ కె. లక్ష్మీనారాయణ, మల్లికార్జున, వెంకటేష్, కె.ఆదినారాయణ, సుబ్బారెడ్డి, అనిల్ కుమార్, సుధాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా కుష్టు నిర్ధారణ సర్వే



నర్సాపురంలో సర్వే చేస్తున్న అధికారులు

రుద్రవరం: కుష్టు వ్యాధి నిర్ధారణ సర్వేను పక్కాగా చేయాలని జిల్లా అదనపు ఆరోగ్య శా ఖాధికారి, లెప్రసీ,ఎయిడ్స్ నివారణ అధికారి శారదాబాయి అన్నారు. నర్సాపురం పీహెచ్ సీ పరిధిలో సాగుతున్న కుష్టు వ్యాధి సర్వేను బుధవారం ఆమె పరిశీలించారు.అనంతరం పీహెచ్‌సీలో పలు రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారి బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షిగణపతి, జ్వాలావీరభద్రస్వామికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో లోక కల్యాణార్థం బుధవారం సాయంత్రం సాక్షిగణపతి స్వామికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్ర స్వామికి విశేష పూజలు నిర్వహించారు. సాక్షిగణపతి స్వామికి పంచామృతాలు, ఫలోదకాలు, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోదకం, శుద్ధజలంతో అభిషేకించి విశేష పుష్పార్చన, నివేదన కార్యక్రమాలు చేపట్టారు. అలాగే జ్వాలా వీరభద్రస్వామివారికి అభిషేకం, విశేషపుష్పార్చన జరిపించారు.

సంపన్న వర్గాలకు మేలు చేసే బడ్జెట్



సమావేశంలో మాట్లాడుతున్న శంకర్

నంద్యాల(న్యూటౌన్): కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ సంపన్న వర్గాలకు మేలు చేసేలా ఉందని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు శంకర్ విమర్శించారు. బుధవారం స్థానిక కార్యాలయంలో బడ్జెట్‌పై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ఏపీకి తీరని అన్యాయం జరిగిందన్నారు. ప్రత్యేక హోదా, విశాఖ రైల్వేజోన్, కడప ఉక్కు కర్మాగారం, పోలవరం ప్రాజెక్ట్ ముంపు బాధితుల పరిహారానికి నిధులు కేటాయించకపోవడం బాధాకరమన్నారు. నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నా నియంత్రణ లేదన్నారు. నరేంద్రమోదీ ప్రభుత్వానికి సంపన్న వర్గాలపై ఉన్న మోజు సామాన్య ప్రజానీకంపై ఏ మాత్రం లేదని చెప్పారు. అమరావతి నిర్మాణానికి రూ.15వేల కోట్లు ఇతర సంస్థల ద్వారా రుణాలు ఇప్పిస్తామని చెప్పడం బాధాకరమన్నరు. సమావేశంలో ఐఎఫ్‌టీయూ కోశాధికారి చౌడప్ప, ఆనంద్, అల్లాబకాష్, సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ రిలీవ్

శిరివెళ్ల: మండల తహసీల్దార్ కులశేఖర్ బుధవారం రిలీవ్ అయ్యారు. ఎన్నికల సందర్భంగా చిత్తూరు కలెక్టరేట్ నుంచి ఆయన బదిలీపై వచ్చారు. ప్రభుత్వం తిరిగి ఆయనను సొంత జిల్లాకు పంపుతూ ఆదేశాలు జారీ చేసింది. దీంతో కులశేఖర్ తన బాధ్యతలను డిప్యూటీ తహసీల్దార్ నర్సిరెడ్డికి అప్పచెప్పారు. నూతన తహసీల్దార్ వచ్చేంత వరకు ఆయన ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో హెచ్ఎం కోటయ్య, ఉపాధ్యాయ సిబ్బంది

చాగలమర్రి: మండల కేంద్రం చాగలమర్రిలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు హ్యాండ్‌బాల్, యోగ క్రీడాంశాల్లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ఎం .కోటయ్య తెలిపారు. బుధవారం పోటీలకు ఎంపికైన విద్యార్థులకు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 20, 21 వ తేదీల్లో ఆళ్లగడ్డ పట్టణంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో హ్యాండ్‌బాల్ జూనియర్స్ విభాగంలో బాలనరసింహుడు, సబ్ జూనియర్స్ విభాగంలో ఉస్మాన్, పండు, యోగ పోటీల్లో 12 నుంచి 14 సంవత్సరాలలోపు విభాగంలో అఖిల్ కుమార్, 14 నుంచి 16 సంవత్సరాలలోపు విభాగంలో సాజిద్ అత్యంత ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. అభినందించిన వారిలో పీడీ దాదాపీర్, పీఈటీ భారతి, ఉపాధ్యాయులులు శాస్త్రి, మహబుబ్‌బాషా, హరినాథ్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, శ్రీనివాసులు, భాస్కర్‌రెడ్డి, మోహన్‌రాజు, సూర్యబాబు, బాలయ్య తదితరులు ఉన్నారు.